గుడాల రాంబాబును పరామర్శించిన జేవీఎస్ఎన్

విశాలాంధ్ర - విశాఖ: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, డీహెచ్పీఎస్ జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబును సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజులు గురువారం పరామ ర్శించారు. అస్వస్థత కారణంగా విశాఖ ఎస్ఆర్ఐ హాస్పిటల్‌లో రాంబాబు చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం పరిస్థితులు అడిగి, కుటుంబం సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు సిఎన్ క్షేత్రపాల్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జెడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారాలకు
పలు రకాల అసమానతలే కారణం
ప్రముఖ న్యాయవాది జహా ఆరా

విశాలాంధ్ర - విశాఖ: సామాజికంగా, రాజకీయంగా మహిళలను అణిచివేసేందుకు వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని ప్రముఖ న్యాయవాది జహా ఆరా అన్నారు. మహిళా పోరాట యోధురాలు కొండపల్లి కోటేశ్వరమ్మ ఆరవ వర్ధంతి సందర్భంగా 'లైంగిక అత్యాచారాలు - మరణశిక్ష పరిష్కారమా?' అంశంపై కామ్రేడ్ వై విజయ్ కుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె స్మారకోపన్యాసం చేశారు. మానవ సమాజంలో మహి ళలపై అత్యాచారాలకు పాల్పడిన వారికి ఒక్కో కాలంలో ఒక్కో రకమైన శిక్షలు ఉండేవని చెప్పారు. మహిళలపై అత్యాచారాలకు సమాజంలో ఉన్న పలు రకాల అసమానతలే కారణమని అభిప్రాయపడ్డారు. సమాజంలో మార్పు రానంత కాలం, చట్టాల అమలులో యంత్రాంగానికి చిత్తశుద్ధి లేనంత కాలం ఎన్ని చట్టాలు ఉన్నా ఫలితం ఉండదని అన్నారు. మహిళలని తక్కువగా చూసే సమాజంలో ఉన్నామని, దీనితోపాటు సమాజంలో పలు రకాల వ్యత్యాసాలు, వివక్షలు ఉన్నాయని చెప్పారు. అనాధ శిశువులు ఎక్కడైనా కనిపించినప్పుడు తల్లిని మాత్రమే నిందిస్తున్న సమాజంలో మనం ఉన్నామని చెప్పారు. అత్యాచారాల కేసుల్లో మహిళలను అనుమానంగా చూస్తున్న పరిస్థితులు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాల కేసుల్లో కఠిన చట్టాలు వచ్చినప్పటికీ అత్యాచారాలు సంఖ్య తగ్గలేదని గుర్తు చేశారు. అత్యాచారాల విషయంలో సమాజం స్పందన ఒక్కోసారి ఒక్కోరకంగా ఉంటోందని అన్నారు. కొన్నిసార్లు నిందితులను వెంటనే ఎన్ కౌంటర్ చేయాలన్న డిమాండ్లు సమాజం నుంచి వస్తున్నాయని తెలిపారు. వాస్తవానికి అత్యాచార బాధితురాలికి న్యాయం అంశాన్ని విస్మరిస్తున్నామని తెలిపారు. వాస్తవానికి బాధితురాలికి జీవితకాలం చేదుడుగా ఉండే ఒక వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడ్డారు. మహిళలపై అత్యాచారాల నియంత్రణకు మౌలిక అంశాలపై దృష్టి పెట్టి, పరిష్కరించాలని.. సమాజంలో అసమానతలను రూపుమాపాలని అన్నారు. మహిళలను తక్కువగా చూసే సమాజంలో చిన్న కారణాలకి సైతం ప్రతీకారంగా అత్యాచారాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ సదస్సుకు ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అధ్యక్షత వహించారు.

దళితుల భూములకు రక్షణ కల్పించండి: విదసం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ కాక ముందే జరుగుతున్న ఇన్సైడ్ ట్రేడింగ్ నుండి ఎస్సీల భూములకు రక్షణ కల్పించాలని విదసం ఐక్య వేదిక జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు వి.రామ చందర్‌కు విజ్ఞప్తి చేసింది. విశాఖ పర్యటనలో ఉన్న రామ చందర్‌ను విదసం ఐక్య వేదిక ప్రతినిధులు గురువారం పోర్టు గెస్ట్ హౌస్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ అసైన్డ్ భూములు అన్యాక్రాంతంపై కమీషన్‌కు వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన 596 జీఓను కొందరు అధికారులు, రాజకీయ పెద్దలు దుర్వి నియోగం చేసి ఎకరా 10 కోట్లు విలువైన భూములను 10 లక్షలకు కొట్టేసారని తెలిపారు. ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములు అమ్మకాల్లో దళితులు మోసానికి గురై నష్ట పోయారని, ఈ వ్యవహారంపై కమిషన్ విచారణ జరిపి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ అడంగల్‌లో అసైన్డ్‌దారుల పేర్లు వుండి రోజుల వ్యవధిలోనే త్వరిత రిజిస్ట్రేషన్ జరిగి ఎవరైనా మోస పోయి ఉంటే కమిషన్ వద్దకు వివరాలతో వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోదాదాసి సుధాకర్, జాజి ఓంకార్, బల్ల కుమార్, కస్తూరి వెంకటరావు, రవి శేఖర్, యుఎస్ రాజు, గుడాల ఈశ్వరరావు, సంతోష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం అక్టోబర్ 1, 2, 3 తేదీలలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు గురువారం 1316వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం అక్టోబర్ 1 నుంచి మూడు రోజుల పాటు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, మూడున్నరేళ్లుగా ఉక్కు కార్మిక వర్గం దీక్షలు చేపడుతున్నామని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగిరాక పోవడం దుర్మార్గమన్నారు. ఉక్కును కాపాడుకోవడం కోసం రెండు మూడు నెలల్లో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంకా ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు కె.రాజబాబు, జె.రామ కృష్ణ, బి.ఎం.ఎల్.నాయుడు, వి.ఎస్.వరప్రసాద్, దుర్గారావు, జి.ఈశ్వర్‌రావు, పి.వి.రమణ, మంచాల గోవిందరావు, జి.ఆనంద్, జాన్సన్, మాజీ జెడ్పీటీసీ బొద్దపు రమణ, కాంగ్రెస్ నాయకులు డి.అప్పల నాయుడు పాల్గొన్నారు.

జీవీఎంసీ జోన్-2 కమిషనర్‌గా సింహాచలం బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ జోన్ 2 జోనల్ కమిషనర్‌గా పి.సింహాచలం గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో జీవీఎంసీలో వివిధ జోన్లలో జోనల్ కమిషనర్‌గా పనిచేసిన సింహాచలం పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ మళ్ళీ బదిలీపై జీవీఎంసీకి వచ్చారు. కమిషనర్ సంపత్ కుమార్ సింహాచలంను జోన్ 2 మధురవాడ జోనల్ కమిషనర్‌గా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది అధికారులు ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురవాడ జోన్లో ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పన కోసం కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

కార్మికుల మనోభావాలు దెబ్బతినేలా బొలిశెట్టి వ్యాఖ్యలు

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం గత ఐదు సంవత్సరాలుగా కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అపహాస్యం చేసేలా జనసేన పార్టీ అధికార ప్రతినిధి బొలిశెట్టి సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుత రావు తీవ్రంగా ఖండించారు. విశాఖలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దీనిపై జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కి బహిరంగ లేఖ రాసినట్టు తెలిపారు. బినామీ కాంట్రా క్టులు చేసే బొలిశెట్టి సత్యనారాయణ మాటలు.. ఎవరో మాట్లాడించినట్టుగా ఉన్నాయని విమర్శించారు. కార్మిక సంఘాలు, కార్మిక పోరాటాల గురించి ఆయనకు ఏమి తెలియదని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మి కులు 1340 రోజులుగా గత ఐదు సంవత్సరాల నుంచి ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. 26 కార్మిక సంఘాలు ఐక్యంగా ఈ పోరాటంలో పాల్గొంటున్నాయని చెప్పారు. బొలిశెట్టి సత్యనారాయణ వ్యాఖ్యలు కార్మికుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని అన్నారు. ఆయన రెండు రోజుల్లో కార్మికులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో విశాఖ ఉక్కు పరిరక్షణపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారని, ఆ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష పోరాట కమిటీ నాయకులను ప్రధాని మోడీ వద్దకు తీసుకెళ్లాలని కోరారు. కార్మిక సంఘాలు, కార్మిక ఉద్యమాలు గురించి తెలియని బొలిశెట్టి సత్యనారాయణ స్టీల్ ప్లాంట్ కార్మికుల పోరాటంపై మాట్లాడడం తగదని అన్నారు. ఆయన తన నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మునుగడ రోజురోజుకూ ప్రశ్నార్ధకంగా మారుతోందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని చంపేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శిం చారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గించడం, యంత్రా లను మూసి వేయడం, పెట్టుబడికి డబ్బులు లేకుండా చేయడం ద్వారా నిర్వీర్యం చేసి ప్రైవేటుపరం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సిఎండి నవంబర్‌లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా ముందుగా సెలవుపై వెళ్లిపోయారని చెప్పారు. ఉద్యోగులను డిప్యూటేషన్‌పై వేరే ప్రాంతాలకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు షేక్ రెహమాన్, ఆర్కే నాయుడు, బూసి వెంకటరమణ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
M.O.P.174/2024
Between:
Phoebe Amruthavalli Mrudubhasini Mylapalli & 2 others ...Petitioners
And
Sri Jakkana Srinivas & 5 others ...Respondents
NOTICE
To,
R-1: Sri Jakkana Srinivas, S/o. Tatababu, (Driver cum Owner of Car AP31TV 6136) R/at D.No.36-92-202/9/1, A.S.R.R.Nagar, Barma Camp Kancharapalem, Visakhapatnam
R-3: Shaik Khasim, S/o. Sadhu, (Driver of Bus AP 31TG 4848) R/at D.No.25-1-98, Swatamtra Colony, Gajuwaka, Visakhapatnam-26
Whereas the above named petitioners has instituted a Motor Accident case against you for the petition claim, you are hereby summoned to appear in the Court in person or by a pleader duly instructed and able to answer all material question relating to the petition or who shall or who shall be accompanied by some person able to answer all such question on the 26th day of September 2024 at 10:30 A.M. in the forenoon to answer the claim and at the day fixed for your appearance in default of your appearance on that day and hour before mentioned the case will be heard and determined in your absence.
S.S. SHARMA, Advocate
Visakhapatnam, Cell: 9849116584

దాలివలసలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కే.కోటపాడు: మండలంలోని దాలి వలస గ్రామంలో గురువారం ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దృష్టిలోపం ఉన్న సుమారు 200 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా 26 మందికి కేటరాక్ట్ ఆపరేష న్‌కు ఎంపిక చేశారు. అలాగే స్థానిక యూపీ స్కూల్ విద్యార్థులకు కూడా కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ మిత్ర రూరల్ డెవ లప్మెంట్ సొసైటీ సభ్యులు బి.మంగపతి, బివి రమణమూర్తి, ఆప్తమా లజిస్టులు మానస, ఇందు, సాయి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌లో అనుకున్న లక్ష్యాలను సాధించాలి
జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో అనుకున్న లక్ష్యాలను సాధించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పాల్గొన్నారు. జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో వివిధ శాఖల లక్ష్య సాధనలో పురోగతిపై సమీ క్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్దేశిత లక్ష్యాలు సాధించడంలో వివిధ శాఖలు పురోగతి సాధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా కొన్ని శాఖల పనితీరు మెరుగుపరుచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 20వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అన్ని శాఖల అధికారులు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సీపీఓ రామారావు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, డిఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ, వ్యవసాయ, హార్టికల్చర్, సెరికల్చర్, డీఆర్డీఏ, పశుసంవర్ధక, మత్స్య, డ్వామా, మెప్మా, మైన్స్ అండ్ జియాలజీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, విద్యా, ఫారెస్ట్ శాఖల అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్మశానాలలో చెత్త తొలగింపు
జనసేన ఫిర్యాదుతో కదిలిన అధికారులు

విశాలాంధ్ర - మునగపాక: జనసేన నాయకుల చొరవతో శ్మశానాలకు మోక్షం లభించింది. నాగులాపల్లి గ్రామంలో మూడు శ్మశానాలు ఉన్నాయి. ఈ మూడింటిని గ్రామ కార్యదర్శులు డంపింగ్ యార్డ్‌గా తయారుచేసారు. గ్రామానికి చెందిన జనసేన నాయకుడు కర్రి వాసు పంచాయతీ సెక్రటరీలపై, ఈవోఆర్డీపై "జిల్లా పంచాయతీ ఆఫీసర్"కి, ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి స్పందించి ఆదేశాలు జారీ చేశారు. దీంతో గురువారం పంచాయతీ సెక్రటరీలు మూడు శ్మశానాలలో పేరుకు పోయిన చెత్తా చెదారంను క్లీనింగ్ చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఈ చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని బీజేపీ ఐటీ కన్వీనర్ మల్ల కాశేశ్వ రావు డిమాండ్ చేస్తూ, ఈ శ్మశానాలను ప్రభుత్వ నిధుల ద్వారా గాని గ్రామ ంలో నిధులు సేకరించి అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మొల్లేటి రాంజీ, డొక్కా మురళి, సెక్రెటరీ నర్సింగరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి
సీడ్ సేవా సంస్థ ప్రతినిధి కనకమహాలక్ష్మి

విశాలాంధ్ర - రావికమతం: బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వాలని అనకాపల్లికి చెందిన సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు కె.కనకమాలక్ష్మి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థినిలకు బాల్య వివాహాలు వలన ఎదురయ్యే అనర్ధాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిరోధక చట్టం అమల్లో ఉన్నందున బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిసిన యెడల తక్షణం హెల్ప్ లైన్ నెంబర్లు 1098,112,100కు ఫోన్ చేసి సమాచారం తెలపాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గొప్యంగా ఉంచుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మాజీ, హెచ్ఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల విద్యతో ఉన్నత స్థానం

విశాలాంధ్ర - కోటవురట్ల: ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఇష్ట పూర్వకంగా చదివితే వారు ఉన్నత స్థానాలకు చేరగలరని మండల టీడీపీ అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సత్య సాయి ట్రస్ట్ ప్రతినిధి కాళ్ల శ్రీనివాసరావు సహకారంతో రాజ గోపాలపురం ఎంపీపీ స్కూల్లో స్కూల్ కమిటీ చైర్మన్ ఎత్తుల అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానకి శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్య సాయి ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఉపకార వేతనాలు తదితర సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటినుండి విద్య పట్ల ఆసక్తి కలిగి క్రమశిక్షణతో విద్యనభ్య సించినట్లయితే వారు ఉన్నత స్థానాలకు చేరగలరన్నారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించిన బోధనలను ప్రతి ఒక్క విద్యార్థి శ్రద్ధగా అవగాహన చేసుకుని ప్రణాళిక ప్రకారం చదివి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించి దేశానికి సేవ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులంతా కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకర బాబ్జి, బోడపాలెం సత్తిబాబు, కోల రమేష్, పాఠశాల హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ఎస్.సత్తిబాబు, కుడుముల రమణ, సిహెచ్ పెంటారావు, రజకుల సేవా సంఘం అధ్యక్షులు అప్పికొండ వెంకట అప్పారావు, సెక్రటరీ పత్తికొండ ప్రసాద్, స్వచ్ఛంద సేవకురాలు లక్ష్మి, రాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తనకు, పిల్లలకు న్యాయం చేయాలి
రాజాం సబ్ స్టేషన్ వద్ద ఓ మహిళ ఆందోళన

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలో వడ్డాది సెక్షన్ రాజం సబ్ స్టేషన్‌లో ఆర్.భీమవరం గ్రామానికి చెందిన రొంగలి నర్సింగరావు షిఫ్ట్ ఆపరేటర్‌గా సుమారు 9 సంవత్సరముల నుండి పని చేస్తున్నాడు. అయితే 2024 ఫిబ్రవరిలో ఆయన మృతి చెందాడు. మృతుడు భార్య రొంగలి రామలక్ష్మి తన పిల్లలకు తనకు న్యాయం చేయాలని గురువారం రాజాం సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. తన భర్త చేసిన ఉద్యోగం తన కుటుంబ సభ్యులకు కాకుండా వేరే మండలానికి చెందిన వ్యక్తికి కేటాయించడం అన్యాయమని వాపోయింది. తన భర్త ఉద్యోగం ఇప్పించాలని కోరినప్పటికీ రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన వేరే వ్యక్తికి ఇచ్చారని ఇది అన్యాయమని పేర్కొంది. తనకు, పిల్లలకు న్యాయం చేయకపోతే రాజాం సబ్ స్టేషన్ వద్దే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది.

గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. లింక్ వర్కర్ స్కీమ్ డిస్టిక్ రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు, లింక్ వర్కర్ స్కీమ్ సూపర్వైజర్ డి.రమణ మాట్లాడుతూ హెచ్.ఐ.వి., లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2 నెలల పాటు నాకో నేతృత్వంలో మీకు తెలుసా కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో హెచ్.ఐ.వి., సుఖవ్యాధులు గురించి పరిజ్ఞానం అందించడం, హెచ్.ఐ.వి. ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కలిగించి తద్వారా ఎక్కువ మంది హెచ్.ఐ.వి. పరీక్షలు చేసుకునేందుకు ముందుకొచ్చేలా చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.అప్పలనాయుడు, ఎం.ఎల్.హెచ్.పి.ఎస్. దుర్గ, ఏ.ఎన్.ఎం., ఆశ వర్కర్స్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: ఏపీఐఐసీ భూసేకరణలో భాగంగా రహదారి కోసం భూములు ఇచ్చే రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఆ ప్రాంతపు రైతులు గురువారం జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతి పత్రం అందజేశారు. ఈ భూములు విషయమై అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కాగిత నుండి పాటిమీద వరకు రోడ్ వెళ్లే రహదారిలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. ధర విషయమై చర్చించారు. వేంపాడు రెవిన్యూలో ఎకరా రేటు 46 లక్షలు, కాగిత రెవిన్యూ ఎకరా రేటు 60 లక్షలు ఇదే చివరి ధరగా రేటు అని తెల్చి సమావేశంలో చెప్పారు. వీలైనంత త్వరగా పరిహారం కోసం చర్యలు తీసుకుంటామని అని చెప్పడం జరిగింది. ఈ మేరకు రైతులు కాగిత సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, ఉపసర్పంచ్, అమలాపురం మాజీ సర్పంచ్ సూరకాసుల గోవింద్, సర్పంచ్ శంకర్రావు, ఉపసర్పంచ్ గంట నర్సింగరావు, కాగిత, పాటిమీద రైతులు వినతి పత్రం అందజేశారు.

మెరైన్ ఎస్ఐగా పైడిరాజు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా జి.పైడిరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. భీమిలి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేసిన ఆయన పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

30 నుండి వైద్య ఒప్పంద కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - గాజువాక: సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూర్టీ, ఫెస్ట్ కంట్రోల్, సూపర్ వైజర్ కార్మికులు దశల వారి ఆందోళనతో ఫలితం లేక పోవడం వలన గత్యంతరం లేని పరిస్థితిలలో ఈ నెల 30నుంచి సమ్మె వెళుతున్నట్లు కార్మికులు తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడంతో సమ్మె నోటీసులు ఆఫీస్ డోర్‌కు అంటించారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులు 19వ రోజు నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలుపుతున్నా అధికారులు నిమ్మకు నిరీతెత్తినట్టు వ్యవహా రించడం తగదు అన్నారు. కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, సంవత్సరానికి 2జతలు

యూనిఫామ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు సమస్యలును సంబందించిన అధికారులు 29లోగా జోక్యం చేసుకొని పరిష్కారం చేయాలని, లేకపోతే 30 నుంచి విధుల బహిష్కరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిన్న, శ్రీ లక్ష్మి,జాన్సీ, సంతోష్ ,శ్రావణి, సంధ్య, మౌలాలిపద్మ వతి, సావిత్రి, పైడమ్మ, లీలా, వర లక్ష్మి, నీలమ్మ, సూరిబాబు,ఈశ్వరమ్మ కిరణ్,కాంతం, పాల్గొన్నారు.

రాహూల్ గాంధీని విమర్శించే స్థాయి ఎవరికీ లేదు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాహూల్ గాంధీని విమర్శించే స్థాయి ఎవరికీ లేదని, బిజెపి మిత్రపక్షమైన శివసేన పార్టీ (షిండే వర్గం) శాసనసభ్యులు సంజయ్ గైక్వాడ్, ఇతర బీజేపీ నేతలు చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ధర్నా నిరసన చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులైన వై.యస్.షర్మిల రెడ్డి ఆదేశానుసారం గురువారం జీవీఎంసీ ఆఫీసు ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం దగ్గర ధర్నా చేపట్టింది. విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అద్దాల వెంకట వర్మ రాజు అధ్యక్షతన పెద్దఎత్తున నిరసన కార్యక్రమం జరిగింది. తదుపరి విశాఖ జిల్లా పోలీస్ కమిషనర్ వారికి లిఖిత పూర్వక ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖ నగర కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ భగత్ పిరిడీ గారు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఏపీసీసీ సెక్రటరీ గాదం మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు, వార్డు ప్రెసిడెంట్లు మధుసూదన్, గౌతమ్ కుమార్, రజినీకాంత్, బ్రహ్మం, సీనియర్ నాయకులు మూర్తి, పదాల రమణ, కస్తూరి వెంకటరావు, పెద్దలు, మహిళ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మణికుమార్, సతీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జోన్-1 జోనల్ కమిషనర్‌గా ప్రేమ ప్రసన్న వాణి

విశాలాంధ్ర - భీమిలి: జీవీఎంసీ జోన్-1, భీమిలి జోనల్ కమిషనరుగా ప్రేమ ప్రసన్న వాణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కె.కనక మహాలక్ష్మి బదిలీపై వెళ్ళినందున, సదరు స్థానంలో పి.ప్రేమ ప్రసన్న వాణి జోనల్ కమీషనరుగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జోనల్ సిబ్బంది జోనల్ కమీషనర్‌ని సాదరంగా ఆహ్వానించారు.

ఓటర్ నమోదు డోర్ టు డోర్ వేగవంతం చేయండి

విశాలాంధ్ర - ఆనందపురం: ఓటర్ నమోదుకు సంబంధించి డోర్ టు డోర్ అండ్ మరణించిన వారి పేర్లు తొలగింపు క్లైయిమ్ పెండింగ్ మీద భీమిలి నియోజకవర్గంలో గల 348 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి భీమిలి పద్మనాభం రెవెన్యూ అధికారులు,అసిస్టెంట్ సిటీ పాల్లర్ జీవీఎంసీ అధికారులు హాజరై నియోజకవర్గ%శీ%, మండలాల వారీగా వెరిఫై అయినవి పద్మనాభం 42,167, ఆనందపురం 51,453, భీమిలి 1,026,60, మంది విశాఖ రూరల్ 1,67,509 ఓటర్లు మొత్తంలో సుమారుగా 3 లక్షలు 60 వేలు మంది ఉన్నారని తెలిపారు. సర్వర్లలో ఏమైనా సాంకేతిక లోపాలు ఉంటే సవరణ చేసుకునే విధంగా చేయాలని, మరణించిన ఓటర్లు ను గడపగడపకు వెళ్లి వెంటనే తొలగించాలని తెలిపారు .కార్యక్రమంలో తాసిల్దార్లు భీమిలి రామారావు, పద్మనాభం ఆనందకుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జీవీఎంసీ శ్రీనివాసరావు, ఆనందపురం డిప్యూటీ తాసిల్దార్ రాజేష్, డిప్యూటీ సర్వేర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విర్వోలు బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సిగ్నేచర్ పెన్షన్‌ను ప్రారంభించిన ఐసిఐసిఐ ప్రుడేన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్

విశాలాంధ -విశాఖపట్నం: ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ సరికొత్త పథకం 'ఐసిఐసిఐ ప్రూ సిగ్నేచర్ పెన్షన్'ను ప్రారంభించింది, ఇది మార్కెట్ లింక్డ్ పెన్షన్ ప్రొడక్ట్‌ని వినియోగదారులకు ఖర్చు మరియు పన్ను సమర్థవంతమైన రిటైర్‌మెంట్ ఫండ్‌ను నిర్మించడానికి వీలు కల్పిస్తుంది. రిటైర్‌మెంట్ ప్లానింగ్ అనేది కీలకమైన అంశం మరియు కస్టమర్‌లందరూ ఆర్థికంగా స్వతంత్రంగా ఉండేందుకు తప్పనిసరి. ఈ ప్రత్యేకమైన పథకం రిటైర్‌మెంట్ ప్లానింగ్‌లో చేరడం మరియు ఆదాయాన్ని పెంచే దశలు రెండింటినీ సమర్థవంతంగా ప్రణాళిక చేసుకోవడానికి వినియోగదారులకు సహాయపడుతుంది. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా మాట్లాడుతూ, "మార్కెట్ లింక్డ్ ప్రొడక్ట్ ఐసిఐసిఐ ప్రూ సిగ్నేచర్ పెన్షన్ ను అందించడం పట్ల మేము సంతోషిస్తున్నాము, ఇది వినియోగదారులకు వారి రిటైర్మెంట్ కార్పస్‌ను నిర్మించడానికి, భారతదేశ వృద్ధి కథనంలో పాల్గొనే అవకాశాన్ని అందిస్తుంది.

మేనేజ్‌మెంట్‌లో 20 నెలల 'యంగ్ లీడర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్' ప్రోగ్రామ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: మేనేజ్‌మెంట్ విద్యలో కొత్త బెంచ్‌మార్క్‌లను నెలకొల్పడానికి ప్రసిద్ధి చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బి), భారతదేశం ప్రపంచానికి భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంలో మరో సంచలనాత్మక మార్గాన్ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. ఐ ఎస్ బి పిజిపి వైఎల్ 20 నెలల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ ను ప్రారంభించినట్లు ప్రకటించింది, ఇది 2 సంవత్సరాల వరకు పూర్తి-సమయం పని అనుభవం ఉన్న అధిక-సాధ్యత గల ఆశావహుల కోసం పూర్తి సమయం ఎంబీఏ సమానమైన రెసిడెన్షియల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్. 2025 మధ్య నుండి ఐ ఎస్ బి యొక్క పీజీపీ వైఎల్ వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపార దృశ్యం మరియు సాంకేతిక అంతరాయాలకు ప్రతిస్పందనగా రూపొందించబడిన వినూత్న మరియు అత్యాధునిక పాఠ్యాంశాల ద్వారా సమగ్ర అభ్యాస అనుభవాన్ని అందిస్తుంది.

60వ వార్డులో అన్నా క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక్ ప్రాంతం పరిధి 60వ వార్డు గోల పాలెం కోరమండల్ పరిశ్రమకు ఎదురుగా గల అన్నా క్యాంటీన్‌ను గురువారం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పివి గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద ప్రజలకు ఐదు రూపాయలకే భోజనం అందించే అద్భుతమైన కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిలుపుదల చేసి ప్రజలకు మూడు పూట్ల భోజనం తినేందుకు ఇబ్బందులకు గురి చసిందని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తమ అధినేత నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు మూడు పూట్ల తిండి పెట్టాలని ఆలోచనతో మొదటగా అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని కంకణం కట్టుకున్నారన్నారు. దీనిలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా ప్రారంభించగలిగామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రథమ పౌరురాలు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం పలికారు. గురువారం ఆమె విశాఖపట్నం విమానాశ్రయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ విశాఖ విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ మెరీనా గ్రౌండ్ లో జరిగే దివ్య కళామేలకు విచ్చేయుచున్న సందర్భంగా ఆయనకు మేయర్ ఘనంగా స్వాగతం పలికారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

విశాలాంధ్ర - పద్మనాభం: ఆంధ్రా యూనివర్సిటీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అండర్ 17 బాలికల విభాగంలో ఫుట్ బాల్ టోర్నమెంట్ క్రీడా పోటీలలో పద్మనాభం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న ఏ.తనూజ రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ కె.గ్రేస్ లిల్లీ తెలిపారు. డీఈవో చంద్రకళ, శ్రీనివాస్, డా. కాలేషా బేగం విద్యార్థిని తనూజ, పిఇటి దేవిని అభినందించారు.

స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ శిక్షణా కేంద్రంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ బ్యాచ్ నందు 45 మంది మహిళలు జాయిన్ అవ్వగా, ఇంకా ఎవరైనా ఆసక్తి గల మహిళలు 9643222666కు సంప్రదించాలని కోరారు.

నూతన ఈఓగా త్రినాధరావు

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా వి.త్రినాధరావు నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ గురువారం సాయంత్రం ఆదేశాలు జారీచేశారు. గతంలో ఈయన ఈ దేవస్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. ఇంతవరకు ఈయన ద్వారకాతిరుమల కార్యనిర్వాహణాధికారిగా ఉండేవారు.

విశాఖ వేదికగా జాతీయ స్థాయి దివ్య కళా మేళా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దివ్యాంగులు, దివ్యాంగ కళాకారులు రూపొందించిన, తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శన నిమిత్తం ఏర్పాటు చేస్తున్న జాతీయ స్థాయి దివ్య కళా మేళా విశాఖ వేదికగా 11 రోజుల పాటు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఏయూ హైస్కూల్ సమీపంలోని మెరైన్ గ్రౌండ్లో దేశ వ్యాప్తంగా వచ్చే కళాకారులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ క్రమంలో 100 స్టాళ్లు ఏర్పాటు చేశామని, రాష్ట్రం నుంచి 10 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని దివ్యాంగజన్ సాధికారత విభాగం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే దివ్య కళా మేళా కార్యక్రమ వివరాలను కేంద్ర దివ్యాంగ సాధికారత విభాగం జాయింట్ సెక్రటరీ నవీన్ షాతో కలిసి కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ వెల్లడించారు. దివ్యాంగులను, దివ్యాంగ కళాకారులను ప్రోత్సహించే క్రమంలో ఈ జాతీయ స్థాయి మేళాను నిర్వహిస్తున్నామని, విశాఖ ప్రజలందరూ ఆదరించి, దివ్యాంగులకు మద్దతుగా నిలవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి రోజూ ఉదయం 9.00 నుంచి రాత్రి 8.00 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేశారు. సాయంత్రం ముగింపు సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. మేళాలో భాగంగా ఈ నెల 26వ తేదీన జాబ్ మేళా కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని యువత, మహిళలు, ఇతర పౌరులు మేళాలో పాల్గొని విజయవంతం చేయాలని, దివ్యాంగులకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సఫాయి మిత్ర కార్మికులకు జెసిబి వాహనాలు, పిపిఇ కిట్లు అందజేత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సఫాయిమిత్ర కార్మికుల సంక్షేమం, ఆరోగ్యమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రత్వ శాఖ మంత్రి డా.వీరేంద్ర కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన జోన్ 3 లాసన్స్ బే కాలనీ ఎం.ఎస్.ఎఫ్-3 లో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తో కలిసి సఫాయిమిత్ర కార్మికులకు జెసిబి వాహనాలు, పిపిఇ కిట్లు అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సఫాయిమిత్ర కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సఫాయిమిత్ర కార్మికులు భూగర్భ డ్రైనేజీలో దిగి తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవలసి వస్తుందని అందుకు ఏ ఒక్క సపాయిమిత్ర కార్మికుడు మ్యాన్ హెూల్ లో దిగకుండా వారి కొరకు నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆర్థిక సహాయంతో లబ్ధిదారులకు స్వచ్ఛత ఉజ్వల యోజన పథకం కింద ప్రత్యేకమైన రెండు జెసిబి వాహనాలను, నమస్తే అనే కార్యక్రమం కింద సఫాయిమిత్ర కార్మికులకు పనిముట్లను అందించడం జరిగిందన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ సఫాయిమిత్ర కార్మికులకు భూగర్భ డ్రైనేజీలో దిగి పని చేయకుండా ప్రత్యేకమైన వాహనాలను జీవీఎంసీ సమకూర్చిందని, ఇప్పటికే జీవీఎంసీ 15 వాహనాలను సఫాయి కార్మికులకు అందించిందని, ఒక్కొక్క వాహనం ఐదు మంది కార్మికులకు గ్రూపుగా కలసి వాహనాలను వినియోగించడం జరుగుతుందన్నారు. ఆ వాహనాల ద్వారా వచ్చిన అద్దె వారి కుటుంబ అవసరలకు ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛత హి సేవా 2024 కార్యక్రమాన్ని ఒక సంజీవినిలా స్వచ్ఛ భారత్ మిషన్ రూపొందించిందన్నారు.

స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత నేపధ్యంగా స్వచ్ఛతా కీ భాగీదారీ, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయిమిత్ర సురక్షా శిబిరం అనే మూడు ప్రధాన అంశాలతో విశాఖ నగరంలో పరిశుభ్రత చర్యల దిశగా ప్రజలను భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. సఫాయిమిత్ర సురక్ష శిబిరాలలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించడం, వారి సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు, భీమా యోజనాలను కల్పించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ నొల్లి నూకరత్న, జోనల్ కమీషనరు-3 శివప్రసాద్, ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీరు క్రిష్ణారావు, సహాయ వైద్యాధికారి క్రిష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

సేనాపతి శంకర్రావు కబ్జా స్థలానికి జీవీఎంసీ పన్ను

అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆగ్రహం

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు టీడీపీ కార్పొరేటర్ సేనాపతి వసంత భర్త శంకర్రావు కుటంబీకులు సాగిస్తున్న భూ కబ్జాలపై నిగ్గు తేల్చాలని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ డిమాండ్ చేశారు. రాంపురం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జివిఎంసి 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వ వార్డు వైసిపి అధ్యక్షుడు మెంట్ మహేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. చిన్నముసిడివాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 113లో మెయిన్ రోడ్డుకు ఆనుకొని 500 గజాల విలువైన స్థలాన్ని సేనాపతి శంకర్రావు కబ్జా చేసి అక్రమంగా కట్టడం చేపట్టారని విమర్శించారు. గతంలో ఆ భూమి ప్రభుత్వానిదని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని ఖాళీ చేయించారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో శంకర్రావు ఆ భూమిలో భారీ కట్టడాలు ప్రారంభించగా, జీవీఎంసీ అధికారులు ఖాళీ స్థలానికి ఇంటి పన్నులు వేసి అతని అక్రమాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై మీడియా కోడై కూస్తున్నా, వామపక్షాలు ఆందోళనలు చేపట్టినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారు ణమని విమర్శించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాన్ని ఎలా సమర్థించు కుంటున్నారో తెలియజేయాలని అదీప్ రాజ్ డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వ భూమిగా ఉన్న స్థలం ఇప్పుడు జిరాయితిగా ఎలా మారిందో చెప్పాలన్నారు. ఎన్నికలై 100 రోజులు కాకుండానే ఇలాంటి దారుణాలకు టిడిపి నాయకులు ఒడిగడుతున్నారని, ఎన్నికల ఖర్చును అప్పుడే వసూలు చేసేసారని ఆక్షేపించారు. దీనిపై ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పందించాలని కోరారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వారే భక్షిస్తే ఇక రక్షించేవారు ఎవరని ఆయన ప్రశ్నించారు. సర్వే నెంబరు 113లో ఆనాడు రెవెన్యూ అదికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను మీడియా ఎదుట ప్రదర్శించారు. అలాగే జీవిఎంసీ అదికారులు ప్రభుత్వఖాళీస్థలానికి వేసిన ఇంటి పన్ను పత్రాలను చూపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శంకరరావు కబ్జాను నిలువరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అదీప్ రాజ్ హెచ్చరించారు.

కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

- సెప్టెంబర్ 30 మహాధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ సెప్టెంబర్ 30వ తేదీన జివియంసి గాంధీ విగ్రహం వద్ద జరుప తలపెట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జగదాంబ సిఐటియు ఆఫీసులో మహా ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ ప్రభుత్వ రంగ సంస్థలలో పర్మనెంట్ కార్మికుల సంఖ్య తగ్గుతుందని వీరి స్థానంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. విశాఖపట్నం పోర్టు ఇ డాక్‌లో సుమారు 2400మంది పర్మినెంట్ కార్మికులు వుండగా 10వేల మంది, షిప్‌యార్డ్‌లో 700మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా 2000 మంది కాంట్రాక్ట్ కార్మికులు వున్నారన్నారు. హెచ్‌పిసిఎల్‌లో 600మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా సుమారు 10వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారన్నారు. రైల్వే, విద్యుత్, ఆర్.టి.సి., యూనివర్శిటీ, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. సంపద సృష్టిస్తున్న ఈ కాంట్రాక్ట్ కార్మికులకు ఏ విధమైన కార్మిక చట్టాలు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం శాశ్వత స్వభావం కలిగిన పనులు చేస్తున్న వారందరికీ "సమాన పనికి - సమాన వేతనం" చెల్లించాలని ఉత్తర్వులు ఉన్నా ఎక్కడా చెల్లించటం లేదన్నారు. చెల్లించని యాజమాన్యాలపై ఏ విధమైన చట్టపరమైన చర్యలు తీసుకోవటం లేదన్నారు. కేంద్రప్రభుత్వం వేసిన కమిటీ సిఫార్సుల మేరకు కనీస వేతనం 26 వేల రూపాయలకు తక్కువ లేకుండా చెల్లించాలని చెప్పినా ఎక్కడ అమలు కావటం లేదన్నారు. 2006 నుండి మన రాష్ట్రంలో కనీస వేతనాల జీవోలు సవరించటం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వం జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. గతంలో 5సం.ల పాటు కాంట్రాక్ట్, కంటింజెంట్, టైమ్‌స్కేల్ ఇలా ఏ పేరుతో పనిచేసిన వారిని రెగ్యులర్ చేసే వారిని ఇప్పుడు పర్మినెంట్ అనే విధానామే ప్రభుత్వాలు పాటించడం లేదన్నారు. ఆప్కాస్ పేరుతో ఉద్యోగంలో చేరిన నాటి నుండి రిట్కెర్‌మెంట్ అయ్యేవరకు పర్మినెంట్ అయ్యే అవకాశం లేదన్నారు. దేశ రక్షణ రంగంలో కూడా కాంట్రాక్ట్ పద్ధతిని, ఫిక్స్‌డ్ టెర్మ్ ఎంప్లాయిమెంట్ పద్ధతిని అమలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమై కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, కంటిమ్‌జెంట్, డైలీవేజ్ ఇలా ఏ పేరుతో పని చేసిన పర్మినెంట్ కాని వర్కర్లందరీని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేసారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కనీస వేతనం రూ26,000లు తక్కువ లేకుండా ఇవ్వాలని, పర్మినెంటేతర కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ 30 వ తేదీన జరుగుతున్న మహాధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా కోరారు.

కిడ్నీలో దుప్పికొమ్ము రాయిని తీసిన ఏఐఎన్‌యూ వైద్యులు

విశాలాంధ్ర-విశాఖపట్నం: సాధారణంగా కిడ్నీలలో రాళ్లంటే చిన్నచిన్నవి ఉంటాయి. కానీ, దాదాపు కిడ్నీ మొత్తం ఆవరించి, బయట కటివలయంలోకి కూడా వచ్చిన దుప్పికొమ్ము ఆకారంలోని రాయి ఉండడం చాలా తీవ్రమైన సమస్య. దాదాపు 80 మి.మీ. కంటే పొడవున్న ఈ రాయి ఇంచుమించు కిడ్నీ ఆకారంలోనే పెరగడంతో మూత్రనాళానికి అడ్డం పడదు, దాంతో నొప్పి తెలియదు, వాపు కూడా అంతగా ఉండదు. అందువల్ల రోగులకు ఇది ఉందనే విషయమే తెలియదు. ఇలాంటి తీవ్రమైన సమస్యను అత్యున్నత సాంకేతిక నైపుణ్యంతో తొలగించారు. విశాఖపట్నంలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్ అమిత్ సాప్లే తెలిపారు. 62 ఏళ్ల వ్యక్తి నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చారు. ఆయనకు స్కాన్ చేస్తే.. కిడ్నీలో స్టాగ్ హార్న్ స్టోన్ (దుప్పి కొమ్ము తరహా రాయి) ఉన్నట్లు తేలింది. దాని వల్ల ఆయన కిడ్నీ పనితీరు కేవలం 18 శాతం మాత్రమే ఉంది. ఇది మామూలు రాళ్ల కంటే చాలా భిన్నంగా ఉంటుంది. పరిమాణం పెద్దది కావడంతో కిడ్నీ వైపు నుంచి కాకుండా ముందు పొట్ట వైపు నుంచి తీసేందుకు పైలోలిథోటమీ అనే పద్ధతిని అవలంబించాం. ఇది కూడా లాపరోస్కొపిక్ పద్ధతిలో పెద్ద కోత లేకుండా చేశాం. ఈ విధానంలోనే మొత్తం రాయిని పగలగొట్టకుండా, దాని కొమ్ములతో సహా బయటకు తీసేశాము. ఒక స్టెంట్ వేసి, శస్త్రచికిత్స ముగించాము. నెల రోజుల తర్వాత ఆ స్టెంట్ తీసేస్తాము. శస్త్రచికిత్స అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో పేషెంటును రెండోరోజే డిశ్చార్జి చేశాం" అని డాక్టర్ అమిత్ సాప్లే వివరించారు. ఈ శస్త్రచికిత్సలో విశాఖ ఏఐఎన్‌యూ ఆస్పత్రికి చెందిన యూరాలజిస్టులు డాక్టర్ రవీంద్ర వర్మ, డాక్టర్ శ్రీధర్, ఎనెస్థటిస్టు డాక్టర్ శ్యాం కూడా కీలకపాత్ర పోషించారన్నారు.

కేజీహెచ్‌లో బాలుడికి అరుదైన చికిత్స

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అగణంపూడిలో నివాసం ఉంటున్న అప్పలనాయుడు 11 సంవత్సరాల కుమారుడు చరణ్ గత నెల ఆగస్టు 31న స్పృహ తప్పడం, ఆకస్మికంగా మా ట్లాడటం వంటి లక్షణాలతో కేజీహెచ్‌లో చేరాడు. అతనికి పోస్టీరియర్ ఎన్‌సెఫలోపతి, మల్టీ సిస్టమ్ ఇన్ఫ్లమేటరీ సింగ్రోమ్ అని నిర్ధారణ అయింది. అ బాలుడు మూడు రోజులు వెంటిలేటర్‌పై ఉన్నాడు, కానీ తీవ్రమైన స్పృహలేని పరిస్థితి లో పలు మార్లు తానే ఎక్స్ట్యూబేషన్ చేసుకునేవాడు. ఐసీటీ పెరిగిపోవడంతో కోనింగ్ అనే ప్రాణాంతక పరిస్థితి వచ్చింది. కానీ కేజీహెచ్ బాలచికిత్స విభాగం అధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి , అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ , జూనియర్ డాక్టర్లయిన డాక్టర్ వాసుబాబు, డాక్టర్ బంగారు, డాక్టర్ కావ్య ల సహకారంతో అద్భుతంగా వైద్యం నిర్వహించారు. ఈ వైద్య బృందం వారి, అహర్నిశ కృషి వల్ల బాలుడు మాస్టర్ చరణ్, 21 రోజుల పాటు కష్టపడి చేసిన చికిత్స తరువాత పూర్తిగా కోలుకుని సెప్టెంబర్ 19 గురువారం డిశ్చార్జ్ అయ్యాడు. ఈ చికిత్సకు రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఖర్చు అయినప్పటికీ, కేజీహెచ్ ఆసుపత్రిలో అన్నీ ఉచితంగా చేయడం జరిగిందని , రోజు వారి కూలీ అయిన అప్పలనాయుడు , డాక్టర్లకు , కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కేజీహెచ్ బాలచికిత్స విభాగం వారి నిరంతర కృషి, ఆధునిక వైద్య సౌకర్యాలు మరియు ఔషధాల సమకూర్పు వల్ల ఈ చిన్నారి ప్రాణాలు కాపాడగలిగారు. కేజీహెచ్ వైద్యుల అంకిత భావం, ప్రత్యేక శ్రద్ధ వల్ల ఇలాంటి జబ్బులను కూడా సమర్థంగా ఎదుర్కోవటంలో ఆసుపత్రి విశేష సేవలను అందిస్తోంది.

చినుకు పడితే మధురవాడలో వరదే

నదిలా ప్రవహిస్తున్న అండర్ బ్రిడ్జి
అనేక కాలనీ ల్లో వరద నీరు
డ్రైనేజీ వ్యవస్థ లేక మధురవాడ జోన్‌లో తీవ్ర ఇక్కట్లు

విశాలాంధ్ర - పీఎం పాలెం : విశాఖ నగరానికి ఖరీదైన ప్రాంతంగా మారిన మధురవాడలో చినుకు పడితే వరద ప్రవాహంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థలు లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. జాతీయ రహదారి సర్వీస్ రోడ్లలో అండర్ బ్రిడ్జి కింద నదిలా వరదనీరు ప్రవహిస్తుంది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు . మధురవాడ జోన్ పరిధిలో అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో అనేక లేఔట్లలో, కాలనీల్లో వరదనీరు చేరిపోవడంతో ఇళ్లకు వెళ్లాలంటే నరక యాతన పడాల్సి వస్తుంది. నిరంతరం విశాఖ నగరాన్ని సుందరీకరణ చేస్తున్న అధికారులు శివారు ప్రాంతాలపై చిన్న చూపే చూస్తున్నారు. మధురవాడ ప్రాంతంలో యూజీడీ పనులు ఇప్పటికి ప్రారంభం కాలేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో భారీ అపార్ట్మెంట్లో వస్తున్న మురుగనీరు రోడ్లపైనే చెరువులు మాదిరిగా తలపిస్తుంది. గుంతల గుంతలు పడిన రోడ్లతో ప్రజలు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విశాఖ నగరానికి నివాస ప్రాంతంగా మధురవాడ జోన్ అగ్రస్థానంలోనే ఉంది. విస్తరిస్తున్న విశాఖ నగర ప్రజల నివాస ప్రాంతాల్లో జివిఎంసి అధికారులు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఈ ప్రాంత నివాస ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలల్లో ఇంటి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కనీసం రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచకపోవడంపై నరకయాతన అనుభవించాల్సి వస్తుందని అనేక కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సర్వీస్ రోడ్డు నిత్యం ట్రాఫిక్ మయంతో కొట్టుమిట్టాడుతుంది. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ ల్లో మురుగు చెత్త పేరుకుపోవడంతో డ్రైనేజీ లన్ని మూతపడిపోయాయి. సర్వీస్ రోడ్లు విస్తరించకపోవడం కొత్త డ్రైనేజీ లు నిర్మాణం చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసిన చెరువులు తలపించేలా రోడ్లు, కాలనీలు మారిపోతున్నాయి. చంద్రంపాలెం హై స్కూల్ ప్రాంగణం అంతా వరదనీటితో నిండిపోయింది. ఇకనైనా అధికారులు శివారు ప్రాంతాలైన మధురవాడ జోన్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్వర్ణాంధ్ర-2047 దిశగా

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించి చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్లతో స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కలెక్టర్ కార్యాలయ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర జిల్లా విజన్ ప్లాన్ అక్టోబర్ 15వ తేదీ నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈనెల 30లోగా మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలని తెలిపారు. ఇదే క్రమంలో స్వర్ణాంధ్ర కొరకు రానున్న ఐదేళ్ల వార్షిక ప్రణాళికను రూపొందించి, ప్రతి ఏటా 15 శాతం ఆర్థికవృద్ధి ఉండేలా డాక్యుమెంటరీ సిద్ధం చేయాలన్నారు. తీర ప్రాంత జిల్లాలో మత్స్య సంపద వృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రచించాలని ఆయన కలెక్టర్లకు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మండల స్థాయిలో ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎస్‌కు తెలిపారు. సోమవారం నుంచి గ్రామస్థాయిలో గ్రామసభలను నిర్వహిం చనున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, స్టేక్ హోల్డర్లతో సమావేశం ఏర్పాటుచేసి, స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనగా ప్రణాళికలు రచించబోతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో

స్వచ్ఛత హి సేవాపై కమిషనర్ ప్రసంగం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్వచ్ఛభారత్ మిషన్ ఆదేశాల మేరకు దేశమంతా జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజలు భాగస్వాములు కావాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆల్ ఇండియా రేడియోలో గురువారం ప్రసంగించారు. స్వచ్ఛత హి సేవా 2024 కార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛత స్వభావం, స్వచ్ఛత సంస్కారం పరిశుభ్రతకు నిదర్శనమని ఆయన తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్-2024 లో మొదటి స్థానం మే లక్ష్యంగా ప్రజల సహకారంతో కృషి చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు. అనంతరం ఆల్ ఇండియా రేడియో అధికారులతో కలిసి "అమ్మ పేరుతో ఒక మొక్క" అనే నినాదంతో రేడియో స్టేషన్ ఆవరణలో ఆయన మొక్కను నాటి అందరికీ స్ఫూర్తిని కలిగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరం 28 శాతం పచ్చదనం కలిగి ఉందని, దానిని ప్రజల సహకారంతో 50 శాతం పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటిలో చెత్తను విభజించి తడి చెత్త నుండి ఎరువును తయారుచేసి ఆ ఎరువుతో ఇంటి ఆవరణలో మొక్కలను పెంచినట్లయితే ఆర్థిక లాభం పొందడమే కాకుండా, నగర పచ్చదనానికి దోహదపడుతుందన్నారు. అలాగే జీవీఎంసీ పలు రోడ్ల సెంటర్ మీడియన్లలో, కూడళ్ళు, గ్రీన్ బెల్ట్ లలో మొక్కలను నాటి పచ్చదనంతో నందనవనంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా యువత మొక్కలను నాటి, చెట్లను పెంచేందుకు ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఆల్ ఇండియా రేడియో స్టేషన్ సుబ్బారావు, ప్రోగ్రామ్ హెడ్ సూర్యప్రకాశరావు, డ్యూటీ ఆఫీసర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో నేడు జిప్సా ఎన్నికలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఎన్నికలు ఈనెల 20వ తేదీన పాతగాజువాక చైతన్యనగర్‌లో గల సూర్యతేజ్ స్కూల్‌లో నిర్వహించనున్నట్టు ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు పాలవలస భాస్కర్ రావు, గిరీష్ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి గిరీష్ విద్యా నికేతన్ భీమిరెడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పదవికి ప్రగతి స్కూల్ సీర షణ్ముఖరావు, కోశాధికారి పదవికి బాలవికాస్ స్కూల్ ముదిలి బాబురావు నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులైన పి. ప్రభాకర్, డి.రాఘవరాజు, యమ్.జగ్గారావులకు అందజేశారు. నామినేషన్ల స్వీకరణ గడువు కూడా ముగిసింది. కార్యక్రమంలో పి.వాసుదేవరావు, యన్.రవికుమార్, వెంకట్, మాధవరావు, రమేష్ నాయుడు, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్యమత ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణంలోని అన్యమత ప్రచారం నిర్వహించడంపై యలమంచిలి పోలీసులకు పలువురు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4-30 నుండి 5 గంటల మధ్య యలమంచిలి పాత వీధిలో గాజువాకకి చెందిన కొంతమంది బలవంతపు మత మార్పులకు ప్రోత్సహిస్తూ హిందూ దేవుళ్ళను దూషించుచూ ప్రోత్సహిస్తున్నారని అన్నారు. హిందువుల ఇళ్ళకు వెళ్లి పాంప్లెట్లు పంచుతూ బలవంతపు మత మార్పిడి చేస్తున్నారని తెలిపారు. ప్రచారం చేస్తూ పట్టు పట్టడంతో వాళ్లని యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్‌కి అప్పగించడం జరిగిందని, ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు అన్నారు. వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గీతం జాతీయ స్థాయి

మూట్‌కోర్టు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - మధురవాడ: న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గత నాలుగు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో గీతం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి పేరుతో నిర్వహిస్తున్న మూట్ కోర్టు పోటీలు గురువారం ప్రారంభం అయ్యాయి. గీతం స్కూల్ ఆఫ్ లా మూట్ మరియు అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలోఈ నెల 22వ తేదీ వరకు వర్చువల్ విధానంలో జరగనున్న ఈ పోటీలను సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ ఏడాది క్రిమినల్ జస్టిస్ ప్రత్యేకించి యాంటీ కరప్షన్‌లా పై విద్యార్థులకు పోటీలు నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడానికి యువ న్యాయవాదులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజం పట్ల భాధ్యతతో వ్యవహరించాలని, కేసులను లోతుగా అధ్యయనం చేయాలని, ధర్మాన్ని పరిరక్షించాలని కోరారు. కృత్రిమ మేధ వంటివి న్యాయవాద వృత్తిని రానున్న సంవత్సరాలలో ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే మానవ మేధస్సుకు సరిసమానమైనది ఏదీ లేదన్నారు. మూట్‌కోర్టుల ద్వారా న్యాయ విద్యార్థులలో నైపుణ్యాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. గీతం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ దేశంలోని అగ్రశ్రేణి న్యాయ విద్యాలయాలలో గీతం స్థానం సంపాదించడాన్ని అభినందించారు. ఈ ఏడాది మూట్‌కోర్టు పోటీల అంశంగా అవినీతి సంబంధ చట్టాలను ఎంచుకోవడం ప్రశంసనీయమన్నారు. అవినీతి కారణంగా అభివృద్ధి ఫలాలు అట్టడుగు ప్రజలకు చేరడం లేదని, దేశ అభివృద్ధి కుంటు పడుతోందని పేర్కొన్నారు. న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించే యువత ఈ పరిస్థితిలో మార్పు తేవాలన్నారు. గీతం న్యాయ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో పాటించాల్సిన మెళకువలుపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, వాదోపవాదాలపై న్యాయస్థానంలో ప్రవేశించే యువతలో వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలను గత నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 22వ తేదీన జరిగే ఫైనల్స్‌లో విజేతలను ఎంపిక చేసి నగదు బహుమతి అందజేస్తామన్నారు. పోటీల వివరాలను మూట్ కోర్టు పోటీల నిర్వహణ కమిటి కన్వీనర్ వర్ధమాన్ పావ వివరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 300 మంది న్యాయ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనున్నారని ఆయన తెలిపారు.

గీతం పరిశోధకులకు ఫైజర్ ఫెలోషిప్

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ద్వారా పిహెచ్‌డి స్కాలర్‌లుగా నమోదు చేసుకుని ఔషధ అధ్యయనాలు జరిపే పరిశోధకులకు ప్రముఖ ఔషధ సంస్థ ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఫెలోషిప్‌లను అందించనుంది. ఈ మేరకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫైజర్ సంస్థలు గురువారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఔషధ అధ్యయనాలు ప్రోత్సహించడానికి ఈ విద్యా గ్రాంటు ఎంతో ఉపకరిస్తుందని ఫైజర్ సంస్థ ఉపాధ్యక్షుడు మురళీధర శర్మ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా ఇప్పటికే ఫైజర్ సంస్థ గ్రామీణ బాలికల కోసం ప్రత్యేక కోర్సు రూపొందించి శిక్షణ ఇస్తున్నదని తెలిపారు. కాగా కార్యక్రమంలో గీతం పరిశోధన విభాగం డైరెక్టర్ డాక్టర్ వి.నందూరి సత్యనారాయణ, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్, గీతం రీసెర్చి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లుబ్జా నిహర్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో

ఫెయిల్ అయిన చంద్రబాబు

- జమీల్ ఎన్నికల్లో వైసిపి అధికారంలో రావడం ఖాయం
- జగన్‌తో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు పాలన చూసిన ప్రజలు ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు కన్నా మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి పాలన చాలా బెటర్ అన్న అభిప్రాయానికి వచ్చేశారని విశాఖ దక్షిణ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం తాడేపల్లి వద్ద గల జగన్ నివాసంలో మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లో చేరి నేటికి నాలుగేళ్లు పూర్తయిందని గుర్తు చేసుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నవ రత్నాలు పథకాలు ద్వారా కోట్లాది మంది ప్రజలకు మేలు జరిగింది అని కొనియాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఊరించి వంద రోజుల్లో ప్రజలను ఉసూరు మనిపించారు అని విచారం వ్యక్తం చేశారు. మహిళలకు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అని ప్రకటనలో చేసినా ఆచరణలో తుస్సు మనిపించారని ఎద్దేవా చేశారు. అన్న క్యాంటీన్లు అదుగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారని మండి పడ్డారు. . అలాగే, ఎన్నికల ముందు అమ్మఒడి పథకం అమలు అడ్డుకుని ఎన్నికల కోడ్ అని ప్రజలకు నిధులు అడ్డుకుని, తీరా ఈ ఏడాది తల్లికి వందనం ఇంకా అధ్యయనం చేయాలి అంటూ, విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతులు ఎత్తేసి ప్రజాగ్రహం చవి చూస్తున్నారన్నారు. వందేళ్లలో కొత్త పెన్షన్, రైస్ కార్డు దరఖాస్తు నోటిఫికేషన్ ఇవ్వలేదు అని ఆయన మండి పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రాఫ్ వంద రోజులు లో పూర్తిగా పడిపోయింది అన్నారు. కేంద్రం జమీలు ఎన్నికలు బిల్లు ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ప్రతి మహిళకు నెలకు 1500, రైతులకు 20 వేల ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉద్యోగం లేదా 3 వేల నిరుద్యోగ భృతి, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు అన్నీ అమలు చేయలేదు అని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు అని అన్నారు. విశ్వసనీయత, నిబద్ధతకు జగన్ సర్కార్ నిలువెత్తు నిదర్శనం అన్నారు. జగన్ హయాంలో అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, తదితర సంక్షేమ పథకాలు ఇంకా ప్రజలు మరచి పిలేదు అన్నారు. లోక్ సత్తా పార్టీ అధినేత జయ ప్రకాశ్ నారాయణ చెప్పినట్టు జగన్ మళ్లీ గెలవకుంటే ఏ పి లో పథకాలు అమలు జరగవు అన్నది నిరూపణ అయింది అని ఆయన స్పష్టం చేశారు. కాగా, జగన్ ముందెన్నడూ లేని విధంగా రెట్టించిన హుషారు, ఉత్సాహంగా కనిపించారు అని వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు.

వివాహితపై వ్యక్తి కత్తితో దాడి

ఆపై ఆత్మహత్య

విశాలాంధ్ర - మునగపాక: తనతో మాట్లాడమని రెండు నెలలుగా వివాహితను వ్యక్తి వేధిస్తున్నాడు. అయినప్పటికీ తాను మాట్లాడకపోవడంతో వివాహితపై కక్ష కట్టిన సదరు వ్యక్తి కత్తితో తలపై తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని చూచుకొండలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై ప్రసాదరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చూచుకొండ గ్రామానికి చెందిన వివాహిత కోయిలాడ చంద్రిక అచ్చుతాపురం బ్రాండెక్స్‌లో పనిచేస్తున్నారు. వారి ఇంటి వెనుక ఉండే కాండ్రేగుల సోముబాబు తనతో మాట్లాడాలని రెండు నెలలుగా చంద్రికను వేధిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ చంద్రిక మాట్లాడకపోవడంతో కక్షపెంచుకున్న సోము బాబు గురువారం ఉదయం 4:30 గంటల సమయంలో బ్రాండెక్స్‌లో డ్యూటీకి వెళుతున్న చంద్రికపై కత్తితో దాడి చేస్తుండగా చంద్రిక అరుపులు విన్న ఆమె భర్త మోహన్ వచ్చి అడ్డుకోగా తనపై కూడా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయాల పాలైన దంపతులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి మెరుగైన వైద్య నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి అక్కడి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా దంపతులపై దాడి చేసి గాయపరిచిన కాండ్రేగుల సోముబాబు కసింకోట మండలం నర్సింగబిల్లి రైల్వే పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు.